నయనానందకరంగా వై.జంక్షన్

- 'వై' ఆకారంలో ఆధునిక వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు
- రూ.58.18 లక్షల వ్యయంతో నిర్మాణం
- రేపు ప్రారంభోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో ఆధునిక వసతులతో నయనానందకంగా వై.జంక్షన్ రూపుదిద్దుకుంటోంది. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశ ద్వారంగా ఉన్న వై.జంక్షన్‌ను ఆధునిక హంగులతో తయారు చేసేందుకు నగర పాలక సంస్థ సిద్ధమైంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో ఎక్కడా లేని విధంగా ఆధునిక ఫౌంటైన్ ఏర్పాటు చేసేందుకు నగర పాలక సంస్థ చర్యలు తీసుకుంది. వై.జంక్షన్‌లో 'వై' ఆకారంలో ఉండే విధంగా ఫౌంటెన్ డిజైన్ చేశారు. ఈ ఫౌంటెన్ పనిచేస్తున్న సమయంలో సందర్శకులపై చిరు జల్లులు పడే విధంగా ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఫౌంటైన్ చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులు నడచి వెళ్లేందుకు ఫుట్ వే బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు రాత్రి సమయాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చనున్నారు. రూ.58 లక్షల 18 వేలతో ఫౌంటెన్ నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



నమూనా చిత్రం



నిర్మాణం జరుపుకుంటున్న వై.జంక్షన్‌లోవై ఆకారం గల ఫౌంటైన్

నగరంలో ప్రధాన జంక్షన్‌గా..

నగరంలో వై.జంక్షన్ ప్రధానంగా మారిపోయింది. గ్రాండ్ ట్రంక్ రోడ్‌ను ఆనుకుని ఉన్న ఈ జంక్షన్‌లో నవయుగ వైతాళికుడు సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, జిల్లా కలెక్టర్ నివాసం, చరిత్ర ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, కేంద్ర కారాగారం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సర్వజన ఆసుపత్రి, అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాల ఇలా అత్యున్నతమైన ప్రధాన కార్యాలయాలు ఈ రోడ్‌లోనే ఉన్నాయి.

రేపు ప్రారంభించడానికి సన్నాహాలు



కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో సిద్ధం చేసిన వై ఫౌంటెన్ స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రూ.58.18 లక్షలతో ఆధునాతనంగా నిర్మిస్తున్నాం. ఈ విధమైన ఫౌంటెన్ ఈ చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడా లేని విధంగా తయారు చేశాం. 15వ తేదీనాటికి ప్రారంభించాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసే ప్రయత్నం చేపట్టాం, సందర్శకులను ఈ ఫౌంటైన్ విశేషంగా ఆకట్టుకోనుంది.

– పాండురంగారావు, ఎస్ఈ, నగర పాలక సంస్థ

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

సీతానగరం: మండలంలోని మునికూడలి వద్ద స్కూటీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం రాజానగరం మండలం దివాన్ చెరువుకు చెందిన వేమగిరి నాగేశ్వరరావు తన భార్య కుమారితో కలిసి రఘుదేవపురంలోని తమ బంధువుల ఇంటికి స్కూటీపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం, సీతానగరం రోడ్డులో మునికూడలి జగ్జీవన్‌రామ్ కాలనీ వద్ద స్కూటీని వెనుక నుంచి ఆటో వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కవచం అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని రాజమహేంద్రరవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి అపస్మారక స్థితిలో ఉన్న కుమారిని దివాన్‌చెరువు వద్దగల మరో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమయిన ముగ్గళ్ళకు చెందిన ఆటోను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

17 నుంచి ప్రత్యేక పూజలు

కడియం: మండలంలోని దుళ్ళలో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాల స్వామివారు, శ్రీ విఖనస ఆచార్య స్వామివార్ల ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు, ఆలయ భక్త బృందం తెలిపింది. ప్రతి శుక్రవారం విశేష కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. 31న శ్రీ విఖనస ఆచార్య స్వామివారి జయంతి మహోత్సవం ఉంటుందన్నారు. వచ్చేనెల 7న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు, గ్రామోత్సవం, ఉట్టికొట్టుట తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ప్రతీ ఇంటి పైనా జాతీయ పతాకం ఎగరాలి



కంబాల చెరువు సెంటర్‌లో జాతీయ జెండాలను అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రతీ ఒక్కరిలో దేశ భక్తిని, జాతీయ భావజాలాన్ని పెంపొందించే విధంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని శ్రీ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ ట్రస్టు చైర్మన్ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ విజ్ఞప్తి చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఆదివారం నగరనంలో కంబాల చెరువు ప్రాంతంలో శ్రీ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ ట్రస్టు ఆధ్వర్యంలో భారత జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల ఐక్యతకు ప్రతీకగా 14, 15 తేదీలలో ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేషన్ ఇవ్వడం లేదు సార్

చందనకు ఫిర్యాదు చేసిన మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకులో ఎండీయూ వాహనం నిర్వహకుడు రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు మహిళలు మొర పెట్టుకున్నారు. ఆదివారం హుకుంపేట డిబ్లాకులో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఆయనకు మహిళలు తమ ఇబ్బందులను విన్నవించారు. రేషన్ ఇవ్వడం లేదని, అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని మహిళలు తెలిపారు. దీంతో చందన ఎంఎస్‌వోకు ఫోన్‌చేసి హుకుంపేట డి బ్లాకు పరిధిలో రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వలంటీర్ల స్వచ్ఛ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రామారెడ్డి

కంబాలచెరువు: స్థానిక వేంకటేశ్వరనగర్‌లోని ఎస్‌బీవీ పార్కులో ఆదిత్య ఉభయ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్. వలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి నిత్య విద్యార్థి, బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి హాజరయ్యారు. దీనిలో భాగంగా 25 మొక్కలను వలంటీర్ల ఆధ్వర్యంలో నాటారు. పార్కు ప్రాంతంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ జి.నాగేశ్వరరావు, డాక్టర్ బీఆర్ రమాదేవి పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎన్.రెహమాన్ వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో కె.సుధాకర్ పట్నాయక్, రేస్ బే క్వీ సత్యనారాయణ, శశికుమార్, ఇంజినీర్‌మూర్తి, అన్నమయ్య, జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఫెలోషిప్‌లు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ (ఐఏజీఈఎస్) సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో 120 మంది పీజీ విద్యార్థులు లాప్రోస్కోపీ సర్జరీలో శిక్షణ పొందారని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సెక్రటరీ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్ తెలిపారు. మరో 50 మంది విద్యార్థులు, వైద్యులు ఎగువ ఉదరకోశంలో, లివర్, గాల్‌బ్లాడర్, పాంక్రియాస్ తదితర వాటికి ఎండోస్కోపీతో పరీక్షలు, చికిత్సకు సంబంధించిన శిక్షణను పూర్తి చేసుకుని ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ జీఐ ఎండోస్కోపీ- ఎండోస్కోపీ రెట్రోగ్రేడ్ కొలాంజియా పాంక్రియోటోపోగ్రఫీ (ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ) ఫెలోషిప్‌లు సాధించుకున్నారన్నారు. 50 మంది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ ఫెలోషిప్ పొందారన్నారు.

జనసేన సమావేశం

కడియం: జనసేన నాయకులు స్థానికంగా ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. కడియం మండల నూతన కమిటీని నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, వివిధ గ్రామాల నాయకులు హాజరయ్యారు. ముందుగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

సారా కేసుల్లో ముగ్గురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. దాడులలో ముగ్గురిని అరెస్టు చేసి 18 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ సంజీవనగర్‌కు చెందిన పెచ్చెటి మణికుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 12లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అతనిని విచారించగా బుడ్డిగ దేవుడు, బర్ల సాయినాథ్ దుర్గప్రవీణ్(పండు)లు సారా సరఫరా చేస్తున్నట్లు వెల్లడించగా ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. రాజమహేంద్రవరం ఆదేమ్మదిబ్బకు చెందిన పిరింట్ల శ్రీనివాసరెడ్డి, పిరింట్ల సత్యవేణిలను అరెస్టు చేసి ఆరులీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వీరికి పిడింగొయ్యి గ్రామానికి చెందిన వేముల సూరిబాబు సారా సరఫరా చేస్తున్నట్టు విచారణలో శ్రీనివాసరెడ్డి, సత్యవేణిలు వెల్లడించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు.



అరెస్టు చేసిన నిందితుడితో అధికారులు

రేపు డ్రైడే

మధురపూడి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం డ్రైడే నిర్వహించనున్నట్టు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) కోరుకొండ సర్కిల్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు మద్యం అమ్మకాలు ఉండవన్నారు.

పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి

వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ నాగేశ్వర్

కడియం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని, పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలని ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియంలోని గిరిజాల కల్యాణ మంటపంలో మండలంలోని సచివాలయ కన్వీనర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పారదర్శక పాలన పట్ల ప్రజల్లో అభిమానం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించే సత్తాగల నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేలా పార్టీ శ్రేణులను మోటివేట్ చేయాలని చందన నాగేశ్వర్ సచివాలయ కన్వీనర్లుకు సూచించారు. పార్టీ శ్రేణులంతా ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ , ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు), పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

వ్యాయామంతోనే ఆరోగ్యం

- కసరత్తులకు ప్రాధాన్యమిస్తున్న నగరవాసులు
- సందడిగా మారుతున్న పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు

ప్రకాశం నగర్ : ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాట అక్షర సత్యమని నమ్మిన ఆరోగ్య అభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేస్తున్నారు. మరికొందరు యోగ, జిమ్‌లకు క్యూ కడుతున్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం, ఎస్‌కేవీటీ కళాశాల గ్రౌండ్ , స్టేడియం వంటి ప్రధాన క్రీడా మైదానాలతో పాటు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల పై వాకింగ్, జాగింగ్‌లు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. వృద్ధులు, మధ్య వయసు స్త్రీ ,పురుషులతో పాటు, ఫిట్‌నెస్ కోసం యువతి, యువకులు సైతం వ్యాయామాలు చేస్తున్నారు. ప్రతి రోజు ఒక గంట వ్యాయామంతో శారీరక ధృడత్వంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా శక్తి మెరుగుపడుతుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గడమే ప్రధాన లక్ష్యం

ప్రస్తుత జీవన విధానంలో మారిన ఆహారపు అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం మంది స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీయువకులు అధిక బరువు కారణంగా పలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జా, బర్గర్‌లు వంటి జంక్ ఫుడ్‌లను అధికంగా తిన్నడం వల్ల స్థూలకాయం బారీన పడ్డుతున్నారు. ముఖ్యంగా యువతీయువకులు అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో రౌండ్లు కొడుతున్నారు. మరి కొందరు గంటల తరబడి వ్యాయామశాలల్లో కసరత్తులు చేసి అధిక బరువును తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫిటినెస్ కోసం కఠిన వ్యాయమాలు చేస్తున్నారు.



పార్కులో వాకర్లు

పలు ఆరోగ్య ప్రయోజనాలు

ప్రతి రోజూ నడక కారణంగా హై బీపీ, మధుమేహం, గుండె జబ్బులు, కోలస్ట్రాల్, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, అందోళన, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు దరి చేరవని, ముఖ్యంగా పిల్లలతో శారీరక శ్రమ కలిగిన ఆటలు ఆడించడం వల్ల మానసిక పరిపక్వత, ఏకగ్రత పెరిగి మంచి ఆలోచన శక్తి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది



జీవన శైలిలో వచ్చిన పలు మార్పుల కారణంగా స్థూలకాయం సమస్య వస్తుంది. కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు ఒక అవగాహన వచ్చింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ వహించడం ఎక్కువైంది. ఇది మంచి విషయం. శారీరక శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తోంది.

– ఏపీడీ ప్రసాదరావు, పీడీ

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయలు) ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. మండలంలోని కలవలపల్లిలో సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ నివాసంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. పార్టీ శ్రేణులు చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. గూడపాటి శివ తండ్రి కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను రాజీవ్ కృష్ణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో బెల్టు టెస్టులకు 17 మంది ఎంపిక

కొవ్వూరు: అచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం కరాటే బెల్ట్ టెస్టులు నిర్వహించారు. నలభై మంది కరాటే క్రీడాకారులు ఈ టెస్టులకు హాజరయ్యారు. ఎల్లో బెల్ట్‌కు మహిర, విజయ్, ఇంద్రకాంత్, ముకుంద్‌లు, ఆరంజ్ బెల్ట్‌కి సీహెచ్ మహీధర్, బ్లూ బెల్ట్‌కి జి.నేహంత్, టి.గీతిక, సీహెచ్ గీతిక, కె.హర్షిత, కె.చాందిక్, గ్రీన్ బెల్ట్‌కు జి.నోషిత, సీహెచ్ యోజిత్‌నంద, వి.సిద్ధార్థ, జి.శ్రీహర్షిత, పర్పుల్ బెల్ట్‌కి బి.ధార్మిక్, ఎం.వంశీకృష్ణ ఎంపికైనట్టు కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఆళ్ల రాధ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉద్యాన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఈఈ ఎస్‌కే ఖాజావలీ హాజరయ్యారు. ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డీఎల్ నారాయణ ఆధ్వర్యంలో ఈ టెస్టులు నిర్వహించారు.

త్యాగధనుల జ్ఞాపకం.. ఈ స్మారక స్థూపం

- నల్లజర్లలో 12 మంది స్వాతంత్య్ర యోధులు
- రేపు భారత 75వ స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా..

నల్లజర్ల: స్వాతంత్య్రోద్యమ పోరాటంలో నల్లజర్లకు ఓ విశిష్ట స్థానం ఉంది. ఉద్యమానికి 12 మందిని అందించిన ఘనత ఈ ప్రాంతానిది. వల్లూరి సుబ్బన్న ఆధ్వర్యంలో అన్ని వర్గాల వారు స్వాతంత్య్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారు. జైలు శిక్ష అనుభవించారు. నాటి పోరాట యోధుల జ్ఞాపకార్థం స్వాతంత్య్రం సిద్ధించి 25 ఏళ్ళయిన సందర్భంగా జాతి తరపున 1972 ఆగస్టు15 నుంచి 1973 ఆగస్టు 14 వరకూ భారత సంవిధానం పేరిట పూర్వపు సమితి కార్యాలయ ఆవరణలో భారత ప్రభుత్వం ఓ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసింది. మహాత్ముని పిలుపు మేరకు ఈ ప్రాంతానికి చెందిన తల్లాప్రగడ ప్రకాశరాయుడు, వల్లూరి సుబ్బన్న, తల్లా ప్రగడ రాజభూషణం, తల్లాప్రగడ దుర్గాప్రసాదరావు, వేగేశ్న సుబ్బరాజు, తిరుమలరాజు వెంకట సుబ్బరాజు, కనుమూరి వెంకటరాజు, పసల కృష్ణమూర్తి, పసల అంజలక్ష్మి, టీఎస్ఎస్ శర్మ, గీతాగంగమ్మ, ఆలపాటి వెంకటసుబ్బయ్య సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైళ్లకు వెళ్లారు. విలువైన తమ ఆస్తులను పోగొట్టుకున్నారు. నాటి సమరయోధుల పేర్లతో పాటు అశోక చక్రం, జాతీయ చిహ్నాలైన తామర పువ్వు, నెమలి, సింహం బొమ్మలతో పాటు రజతోత్సవ విశేషాలను హిందీ, తెలుగు భాషల్లో ఈ స్థూపంపై లిఖించారు. ఇది నాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా, నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఇంతటి చరిత్ర ఉన్న ఈ ప్రాంతాన్ని 2015 డిసెంబర్ 9న మహాత్ముని మనువరాలు ఉషా గోగాని గాంధీ సందర్శించారు. వట్టి గొప్పలు చెప్పకుండా దేశానికి ఏదైనా మేలు చేసి చూపాలన్న మహాకవి గురజాడ స్ఫూర్తిని పాటిస్తూ ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం రోజు పతాకావిష్కరణ చేసేవారంతా మననం చేసుకోవాలని గాంధేయవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమరయోధుల స్మారక స్థూపం

సంఘటితమైతేనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యం

- మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్
- రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

కొవ్వూరు: ఆర్యవైశ్యులంతా సంఘటితంగా మెలిగితే అభివృద్ధి చెందవచ్చని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగావకాశాలు రాకపోయినప్పటికీ ఆర్యవైశ్యులు వ్యాపార అవకాశాలను వదులు కోకూడదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉన్న వ్యక్తులు మాత్రమే ఆర్యవైశ్య సంఘాలకు నాయకత్వం వహించాలని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు, జిల్లా సంఘం అధ్యక్షుడిగా కొత్త బాల మురళీకృష్ణలతో టీజీ వెంకటేష్, గ్లోబల్ చైర్మన్ టంగుటూరి రామకృష్ణ, అంబికా కృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నిరుపేద ఆర్యవైశ్యులకు మండలానికి మూడు చొప్పున 80 గ్రైండర్లు పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ముగ్గురికి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆర్యవైశ్య మహాసభ అడ్వైజర్ దేవకి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వీవీకే నరసింహమూర్తి, అదనపు కార్యదర్శి నుదురు మాటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మద్దుల సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గ్రంధి గౌతమ్, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు నాళం వీర వెంకట శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుడు గ్రంధి ప్రవీణ్, కొవ్వూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



కత్తిని ప్రదర్శిస్తున్న కోనా శ్రీనివాసరావు, టంగుటూరి రామకృష్ణ, టీజీ వెంకటేష్

'కౌలూరి'కి సాహితీ చదరంగ ప్రపూర్ణ పురస్కారం

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కౌలూరి ప్రసాదరావుకు సాహితీ చదరంగ ప్రపూర్ణ బిరుదు లభించింది. కాకతీయ వైభవ కీర్తి అనే సంస్థ హైదరాబాద్‌లో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసింది. కొవ్వూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాదరావుకు బాల్యం నుంచి సాహిత్యాభిమాని. అంతేగాకుండా మానవ మనస్తత్వ విశ్లేషణలో ఆయనకు అనుభవం ఉంది.